సీరియల్



• బొమ్మిడి అప్పారావు

(గత సంచిక తరువాయి)

వీరయ్య వేణ్ణీళ్ళు తేగానే సిరంజి స్టెరిలైజ్ చేసి యింజక్షన్ లోడ్ చేసి తనే స్వయంగా యింజక్షన్ చేశాడు జ్వలితకు.

కళ్ళు తెరిచి తండ్రివంక చూసి బలహీనంగా నవ్వింది జ్వలిత. కాఫీ పట్టించాక కాస్త తేరుకున్నది. అప్పుడు గుర్తించింది తండ్రి చాలా డల్‌గా వున్న విషయం.

రాఘవేంద్రరావుకి విషం పీల్చి ఉమ్మేసినప్పట్నుంచి నోరంతా అరుచిగా అయిపోయింది. నీళ్ళు చాలాసార్లు పుక్కిలించి ఉమ్మినా, యెందుకో అనీజీగా వున్నది.

ఈజీచైర్లో కూచుని అలసటగా కళ్ళు మూసుకొన్నాడు. సుభద్రమ్మ తండ్రీ కూతుళ్ళ మధ్య నలిగి పోతోంది. మంత్రం వేయాల్సింది పోయి యీయన ఏవో యింజక్షన్లు చేస్తూ టైం వేస్ట్ చేస్తున్నాడని మొదట్లో

లోలోపలే భర్త మీద విసుక్కుంది. కాని, కూతురు తొందరగా రికవర్ కావటం చూశాక భర్త చేసిన పని మీద గురి కుదిరింది. మనసులోనే భర్తను విసుక్కున్నందుకు, లెంపలు వేసుకుంది.

కాని, ఇప్పుడు చెట్టంత మనిషి అలసటగా నీరసంగా వాలిపోగానే అదురు పుట్టిందామెకు. ఎంతైనా విషం విషమే! ముందు వెనక చూడకుండా నోటితో విషాన్ని పీల్చేశా రాయన! పొరపాటున ఒక్క చుక్క గొంతులోకి పోలేదు కదా! ఆమె భయం అదే! మూసివున్న తలుపుల్లోంచి సర్పం లోపలికి యెలా వచ్చిందో యెవరూ ఆలోచించలేదా క్షణంలో.

ఆ విషం రాఘవేంద్రరావుని ఏమీ చెయ్యలేదు గాని, ఆ మర్నాడు అతనిపైన పడ్డ అభియోగం విషంకన్న తీవ్రమైన పరిణామాన్ని చూపించింది. అతని మచ్చలేని జీవితం మీద చెరగని మచ్చను మిగిల్చింది.

• • •

మర్నాడు పదిగంటలవేళ వరంగల్ నుంచి రాఘవేంద్రరావు పై అధికార్లు, సిరిపూర్ పోలీసుల్ని వెంటబెట్టుకుని అడవి కొచ్చారు.

రాఘవేంద్రరావు తన ఆఫీసర్స్‌ని సాదరంగా ఆహ్వానించాడు. ఫిలిప్‌ని హత్య చేసిన విషయం కూడా తెలియబరిచాడు. స్పాట్‌కి తీసుకువెళ్ళి అన్నీ వివరించి చెప్పాడు.

“నిన్నే వస్తారని ఎదురుచూశాను. తమరెందుకో రాలేదు” అన్నాడు పై అధికారితో. ఆయనకు రాఘవేంద్రరావు పట్ల చాలా నమ్మకం.

“మిస్టర్, రాఘవేంద్రరావ్, మీ మీద మాకు

కంప్లెయింట్స్ వచ్చాయి" అన్నా డా ఆఫీసర్ చలి పిడుగులా.

స్థాణువులా నిల్చుండిపోయాడు రాఘవేంద్రరావు.

"ఏమిటి సర్, మీ రంటున్నది?"

"మీరు ఎర్ర చందనం చెక్కల్ని అక్రమంగా బయటకు రవాణా చేయించారని నమ్మకంగా తెలిసింది...."

"సర్, ఇది చాలా అన్యాయం! నామీద యిలాంటి ఆరోపణ చేస్తున్నది మీ రేనా? నా చెవులు నన్ను మోసం చేయటంలేదు కదా!"

"మిస్టర్ రాఘవేంద్రరావ్! కొంతమంది అక్రమ రవాణాదార్లతో కుమ్మక్కయి చందనాన్ని అడవి దాటించారు మీరు! మీ మాట వినటంలేదని ఠాణేదార్ గోపాల్‌ని, గార్డు ఫిలిప్‌ని మీ రే హత్య చేయించారు."

"ఇది మరీ దారుణం! నా కంఠంలో ప్రాణం వుండగా అవినీతికి అక్రమానికి పాల్పడను. ఇన్నాళ్ళు నేను చేసిన సర్వీస్‌ని, నా వ్యక్తిత్వాన్ని దారుణంగా అవమానించారు. ఇంతకన్న నన్ను షూట్ చేసి వుంటే చాలా సంతోషించి వుండేవాడ్ని!"

"డోంట్ అఫెండ్ మిస్టర్ రాఘవేంద్రరావ్! పరిస్థితులు మనిషి బలహీనతమీద దెబ్బతీస్తాయి. ఇంతకాలం మీ మీద మాకు తిరుగులేని విశ్వాసమున్నది. ఫారెస్టు ఆఫీసర్లలో నిజాయితీ లేదనే నిందను మీరు ఒకటి రెండ్లతో పెకలించివేశారని ఎంతగానో చెప్పుకుని గర్వించేవాళ్ళం! కాని మీరు కూడా సగటు మనిషేనని అర్థం చేసుకున్నాం!"

"సర్, మీ మాటలతో నన్నిక బాధించకండి. సరైన

ఆధారాలు చూపించండి."

"ఆధారాలు కావాలా? ఎర్ర చందనం కలపను లారీలోనించి అన్‌లోడ్ చేయించానన్నారే! మరి ఆ లాట్ కనిపించదేం?"

"చెప్పానుకదా సర్! వాటిని మళ్ళీ ఆ నాయురే వచ్చి లోడ్ చేసుకుపోయాడని! ఆ సందర్భంలో నే అడ్డుకోబోయిన కానిస్టేబుల్‌ని చంపేసి శవాన్ని వెంట తీసుకుపోయారనీను."

"చెప్పారు, చక్కటి కట్టుకథ. గోపాల్‌ని చంపటానికి, చందనాన్ని మాయం చెయ్యటానికీ కలగలిపి చెప్పారు—తిరుగులేని కథ! మరి, ఆ మేజర్‌కి ఫిలిప్‌తో శత్రుత్వం ఎందుకొచ్చింది? ఫిలిప్‌ని కూడా చంపేసి శవాన్ని హంతకుడు—మీ భాషలో మేజర్ వీరేంద్ర—వెంట తీసుకుపోయాడా? ఇన్నాళ్ళుగా జరగని హత్యలు ఒకదాని వెంట మరొకటి మీ హయాంలో యెలా జరుగుతున్నాయో అర్థం చేసుకోలేనంత మూర్ఖులం కాదు!"

సున్నితమైన చోట దెబ్బ కొట్టాడు ఆఫీసరు. రాఘవేంద్రరావు వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. ఫిలిప్ మరణానికి సహేతుకమైన కారణమే వున్నది. కాని అది పైకి చెప్పుకునేది కాదు. చెప్పినా ఆ పరిస్థితుల్లో వాళ్ళు నమ్మరు. తన పరువు రచ్చకెక్కినా, ఫలితం దక్కుతుందన్న నమ్మకం లేదు. తన కూతురి పేరు బయట పెట్టడంకన్న వాళ్ళు వేయబోయే శిక్ష భరించటమే నయం!

ఓ పక్క పోలీస్ ఇన్‌స్పెక్టరు తన ఇన్వెస్టిగేషన్ చేసుకుంటూ పోతున్నాడు. తన సిబ్బందిని పక్కగా పిలిచి

ఏవేవో ప్రశ్నలు వేస్తున్నాడు. అతనేమడుగుతున్నదీ వాళ్ళేం సమాధానం చెప్తున్నదీ వినిపించటంలేదు. తనని పై అధికారులు ప్రశ్నిస్తున్న సమయంలోనే ఇన్‌స్పెక్టరు తన పని చేసుకుపోతున్నాడు.

"మిస్టర్ రాఘవేంద్రరావ్, మీ నుంచి సహేతుకమైన సమాధానం కావాలి!" మరో ఆఫీసరు గద్దిస్తున్నట్టు అడిగాడు. ఆయన డివిజినల్ ఫారెస్టు ఆఫీసరు.

రాఘవేంద్రరావు నిబ్బరంగా చెప్పాడు: "సర్! ఇప్పటిదాకా నా మీద వచ్చిన ఆరోపణలు నిరాధారం. నాయుడు చందనం తోలుకుపోయిన మాట నూటికి నూరు పాళ్ళు నిజం! తాణేదారుని అతను, అతని మనుషులు చంపగా మన సిబ్బంది కొందరు చూశారు కూడా! బీరేంద్రకి తప్ప గార్డు ఫిలిప్‌ని చంపే అవసరం, అవకాశం మరొకరికి లేవు. నేను చెప్పవలసిందంతా చెప్పాను. నా గొంతు కోసేసినా నా నుంచి అబద్ధం రాదు; క్షమించండి!"

డివిజనల్ ఆఫీసర్ సిబ్బందిని పిలిచి ఎంక్వయిరీ చేశాడు. ఒక్కరు కూడా నాయుడు తాణేదారు గోపాల్‌ని చంపగా చూసినట్టు చెప్పలేదు. రాఘవేంద్రరావు హతాశుడయ్యాడు. బీరేంద్రమీద రాఘవేంద్రరావు పెద్ద కేకలు వేశాడని కూడా చెప్పారు.

"సో, బీరేంద్రతో మీకు పాత కక్షలేవో వున్నాయని అర్థమయ్యింది. అంతేకాదు, బీరేంద్ర అడవిలో హంటింగ్ చేసుకోవటానికి అతనేదో యిల్లు కట్టుకోవటానికి పెద్ద మొత్తం మీరు లంచం తీసుకుని అనుమతించారని, ఆ విషయంలో ఏవో తేడాపాడాలొచ్చి బీరేంద్రతో మీరు ఘర్షణపడ్డారని తెలింది. గోపాల్, ఫిలిప్

మీ అక్రమపనులకి అడ్డు తగులుతున్నారనే కోపంతో వాళ్ళని చంపేశారు" అన్నాడు డివిజనల్ ఆఫీసరు.

నెత్తిన పిడుగులు పడ్డా అంత చలించి వుండేవాడు కాదు రాఘవేంద్రరావు. తన స్టాఫ్ మెంబర్సు కూడా యెందుకు అబద్ధపు సాక్ష్యాలు చెప్తున్నారో అతనికి అర్థంకాలేదు. కాని, కారణం గ్రహించటం అతనికి కష్టం కాలేదు.

తను రాకముందు వాళ్ళు అవినీతికి బాగా అలవాటు పడిపోయారు. నాయుడులాంటి కలప కాంట్రాక్టర్లతో లాలూచీ పడి, కలప అక్రమ రవాణాకు సహాయపడి, వాళ్ళ నుంచి లంచాలు తినటం మరిగారు. తనొచ్చాక వాళ్ళ ఆటలు కట్టాయి. లంచాలు దొరకటం లేదు. అందుకని తను యిక్కడ్నుంచి వెళ్ళిపోవాలి! తను కాక యెవరొచ్చినా వాళ్ళ పూర్వపు ఆదాయం మళ్ళీ దొరుకుతుంది. ఇన్నాళ్ళు తన ముందు తనకి భయపడి నక్క వినయాలు నటించారు. ఎంత నయవంచకులు! తన నిజాయితీకి, నీతికీ లభించిన ప్రతిఫలం ఏమిటి?

పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావుని సమీపించి "మీ మీద చాలా అభియోగాలు వచ్చాయి. తాణేదారు గార్డు మరణంతో మీకు సంబంధముందని అనుమానిస్తున్నాం. ప్రథమ అనుమానితులు మీరే! మిమ్మల్ని అరెస్టు చేయాల్సి వుంటుంది" అన్నాడు.

రాఘవేంద్రరావు పోలీస్ ఇన్‌స్పెక్టర్ వంక సూటిగా చూశాడు. ఆ చూపులోని తీవ్రత ఆ ఇన్‌స్పెక్టర్ని కలవరపరిచింది.

"మై డియర్ ఇన్‌స్పెక్టర్! కేవలం అనుమానం మీద ఓ, బాధ్యతగల ఆఫీసర్ని అరెస్టుచేసే అధికారం మీకు

లేదు. షో మి వారంట్....!" అన్నాడు రాఘవేంద్రరావు.

ఇన్‌స్పెక్టర్ తడబడి సర్దుకుని, "యూ వాంట్ వారంట్!? ఆల్ రైట్, ఇరవై నాలుగు గంటల్లో వారంట్‌తో తిరిగొస్తాను. ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్ యిప్పుడు మీరు డ్యూటీలో వున్న బాధ్యతగల ఫారెస్టు ఆఫీసర్ కాదు!" అన్నాడు.

"వాట్? యు ఆర్ ఇన్సల్టింగ్ మీ!" అరిచాడు రాఘవేంద్రరావు.

డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు ఓ టైపు చేయబడ్డ కాగితాన్ని మౌనంగా రాఘవేంద్రరావుకి అందించాడు.

రాఘవేంద్రరావు టెన్షన్ అణచుకొంటూ దాన్ని చూసి పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు.

అది తనను సస్పెండు చేస్తూ యివ్వబడ్డ గవర్నమెంటు ఆర్డరు!

రాఘవేంద్రరావు మెదడులో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. అతని కళ్ళకు ఎదురుగా వున్న మనుషులు కనిపించటంలేదు. అసలేమీ కనిపించటంలేదు. అంతా అలికేసినట్టుగా, మసకగా వుంది! చెవుల్లో సప్తసముద్రాలు హోరెత్తుతూ ఘోష పెట్టినట్టు విపరీతమైన శబ్దాలు! అతని గుండెను ఎవరో ఇనపపిడికిలితో నొక్కేసినట్టు చెప్పలేని బాధ!

తన సిన్సియారిటీకి, అన్నాళ్ళు నిజాయితీగా చేసిన సేవకు ప్రభుత్వం తనకిచ్చిన బహుమతి సస్పెన్షన్ ఆర్డర్స్! ఎంక్వయిరీ ప్రూవ్ అయితే డిస్మిసల్ ఆర్డర్స్ కూడా వస్తాయి. ప్రూవ్ అయితీరుంది! తనే గోపాల్‌ని, ఫిలిప్‌ని చంపటం కళ్ళారా చూశామని అక్కడివాళ్ళ

ప్రత్యక్ష సాక్ష్య మివ్వటం న్యాయం! నీతిలేని మనుషులు!

రాఘవేంద్రరావుకి అప్పుడు స్ఫురించింది—తన కింద పనిచేసే సిబ్బందే తనకి వ్యతిరేకంగా అంత ధైర్యంగా ఎలా తప్పుడుసాక్ష్య మిచ్చారో! తనని సస్పెండ్ చేసిన విషయం తనకి తప్ప అక్కడున్న అందరికీ తెలుసు. అందుకే నిర్భీతిగా తప్పుడుసాక్ష్య మిచ్చారు; తనేంచేయ లేడనే ధీమాతో!

అంతేకాదు; ముందుగానే ఆర్డర్సు టైప్ చేయబడి సిద్ధంగా వున్నాయంటే, తనమీద. యిక్కడికి ఎంక్వాయిరీకి రాకముందే, పెద్ద కుట్ర జరిగిపోయింది! ఆ కుట్ర వెనక వున్న మనిషి ఎవరో అతనికి తెలిసిపోయింది.

"నాయుడూ, నీ అంతు చూస్తాను!" మనసులోనే ఘోరంగా శపథం చేసుకున్నాడు రాఘవేంద్రరావు. ఆఫీసర్లు నిన్న సాయంత్రం రాకుండా ఈ రోజే యెందుకొచ్చారో కూడా అతనికి అవగాహనయ్యింది. నాయుడు న్యాయాన్ని, ధర్మాన్ని డబ్బుతో కొనేశాడు. తనమీద కసి యీ విధంగా తీర్చుకున్నాడు. తనని వెన్నుపోటు పొడిచాడు!

ఆఫీసర్లు వెళ్ళిపోయారు. పోలీసులు వెళ్ళిపోయారు. ఇన్‌స్పెక్టరు వెళ్తూ తనవంక కోరగా చూస్తూ గర్వంగా ఠీవిగా నడుచుకుంటూ వెళ్ళి జీప్ ఎక్కాడు. అన్నాళ్ళు తన నీతిని నిజాయితీలకు సమాధి కట్టి, తనమీద అవినీతి ముద్రవేసి, తన పరువును పదిమందిలోను వేలంపాడి ఆఫీసర్లు మాటమాత్రం చెప్పకుండా వెళ్ళిపోయారు!

తన కింది సిబ్బంది మచ్చుకైనా ఒక్కడు కూడా లేకుండా చల్లగా జారుకున్నారు. ఇప్పుడు తనకి వాళ్ళ మీద ఎలాంటి అధికారాలు లేవు!

రాఘవేంద్రరావు చేష్టలుడిగి చాలాసేపు అలాగే ఫుట్‌పాత్ వరండాలో నిల్చుండిపోయాడు!

ఓ చల్లని చేయి అతని జబ్బ పట్టుకున్నది.

గిరుక్కున తిరిగిచూశాడు. జ్వలిత! నీళ్ళు నిండిన కళ్ళతో అతని కళ్ళలోకి ఆర్ద్రంగా, ఆప్యాయంగా, ప్రేమగా చూస్తోన్న కూతుర్ని చూశాక రాఘవేంద్ర రావుకి దుఃఖం ఆగలేదు! కన్నీళ్ళు చెక్కిళ్ళ మీదుగా జాలువారిపోతుంటే జ్వలిత కొనగోటితో తుడిచింది.

తండ్రి ముఖంలోకి చూసి గంభీరంగా నవ్వింది.

"డాడీ! నీ నిజాయితీకి లభించిన అవార్డు చూశావు కదా....! పద డాడీ వెళ్దాం!" అన్నది వెన్నెల్లా చల్లగా.

రాఘవేంద్రరావు పదేళ్ళు వయసు ఒక్కసారిగా మీదపడిపోనట్టుగా క్రుంగిపోయాడు. అజానుబాహుడైన అతని చేతులు సత్తువను కోల్పోయినట్టు ఆధారం లేకుండా వాలిపోయాయి.

తండ్రిని పొదవి పట్టుకుని క్వార్టర్సుకి తీసుకువెళ్ళింది జ్వలిత.

ఆ రాత్రి ఆ యింట పొయ్యి వెలిగించబడలేదు. ఎవరికీ నిద్రాహారాలు లేవు. కాపలా పడుకునే మనిషి గాని, వాళ్ళ ఆలనాపాలనా చూసే కుక్ వీరయ్య గాని తొంగిచూడలేదు ఆ యింటివైపు.

ఆ యిల్లు పాడుబడిన రాజకోటలాగా వున్నది. ఆ యింట్లో నట్టింట ఈజీఛైర్ లో కూచునివున్న రాఘవేంద్రరావు సామ్రాజ్యాన్ని కోల్పోయిన చక్రవర్తిలా వున్నాడు.

"పడుకో డాడీ!" అని అప్పటికి పదోసారి చెప్పింది

జ్వలిత. కాని రాఘవేంద్రరావు అలాగే శూన్యంలోకి చూస్తూ కుర్చీలో కూచుని ఆ కాళరాత్రి గడిపేశాడు.

తండ్రి అవమానం భరించలేక ఏదైనా అఘాయిత్యానికి పాల్పడతాడేమోనని ఆ రాత్రంతా కళ్ళల్లో ఒత్తులు వేసుకుని కనిపెట్టుకుని వున్నది జ్వలిత. సుభద్రమ్మ దుఃఖ భారంతో నేలమీద కొంగు పరుచుకుని పడుకొన్నది. ఆమె కూడా భర్తతో జాగారం చేసింది.

తెల్లవాఝామున యెప్పుడో నిద్రకు జారిపోయిన జ్వలితకు బారెడు పొద్దెక్కేవరకు మెలకువ రాలేదు

త్రుళ్ళిపడి లేచింది. అదికూడా తనంతట తాను మేల్కొనలేదు. తల్లి హడవిడిగా తట్టి లేపుతోంది.

జ్వలిత కళ్ళు నులుముకుంటూ లేచి, "ఏమిటమ్మా. ఏం జరిగింది?" అన్నది. ఆమె మనసేదో కీడును శంకిస్తోంది. ఇంట్లో యెక్కడా తండ్రి జాడ కనిపించటంలేదు.

"ఆ నాయుడు మళ్ళీ అడవిలోకి వచ్చాడట. మీ నాన్నగారు రివాల్వర్ లో గుళ్ళు లోడ్ చేసుకుని అడవి లోకి పరుగెత్తారు. నాకు భయంగా వుందమ్మా!" అన్నది సుభద్రమ్మ.

జ్వలిత మరుక్షణం చందనం చెట్లవైపు పరుగుపెట్టింది. తండ్రి అభిమానధనుడు! శత్రువును చంపిగాని నిద్ర పోడు! తను వెళ్ళేలోపల యెలాంటి అవాంతరం జరక్కూడదని వేయి దేవుళ్ళకు మొక్కుకున్నది.

జ్వలిత వెళ్ళేసరికి నాయుడికి, తండ్రికి వాగ్వివాదం జరుగుతోంది. చెట్టుచాటున నించుంది.

"....ఇప్పటికైనా తెలిసిందా నా పరపతి యెంత పవర్ ఫుల్ గా వుందో?!....అసలు నీ కుటుంబాన్ని సర్వ నాశనం చెయ్యాలని కంకణం కట్టుకున్నాను. అసలు

మొన్నోసారి నీ యింట్లో నల్లత్రాచును కూడా వదిలేయించాను. నిన్ను కాటందుకోటానికి బదులు నీ కూతుర్ని కాటేసింది. అయినా బతికిపోయింది. అయితే యీ లోపల నే జెయ్యాల్సిన పన్లన్నీ జేయించాను. నీ పద వూడగొట్టించాను. నా కున్న పరపతి అర్థమయిందా? వెళ్ళెళ్ళు. నువ్విప్పుడు కోరలు పీకేసిన పామువి! బుస కొట్టడమే గాని కాటెయ్యలేవు. పో, పో!" అన్నాడు నిర్లక్ష్యంగా నాయుడు.

రాఘవేంద్రరావు చేతిలో రివాల్వర్ ప్రత్యక్షమయ్యింది. "రేయ్ నాయుడూ! ఈ రోజుతో నీ చరిత్ర సమాప్తమయిపోంది. నా మీద కక్షతో మచ్చలేని నా జీవితానికి మచ్చ తెచ్చావు. పై ఆఫీసర్లతో నా పరువు పోగొట్టావు. నా కిప్పుడు అధికారం లేకపోయినా నా ఒంట్లో చేవ చావలేదు. పౌరుషం అడుగంట లేదు." రాఘవేంద్రరావు సేఫ్టీ కాచ్ తప్పించాడు.

జ్వలిత తండ్రిని వారించాలనుకున్నది. తండ్రి హంతకుడు కాకుండా నిరోధించాలనుకున్నది. చెట్టుచాటునించి బయటకు రాబోయింది.

అయితే యింతలో వూహించని సంఘటన జరిగి పోయింది. రాఘవేంద్రరావు వెనుక నుంచి వాచ్ మన్ జక్రయ్య ఓ కర్రతో అతని చేతిమీద కొట్టాడు.

రివాల్వర్ ఎగిరి అవతల పడింది.

రాఘవేంద్రరావు ఛర్రున వెనుతిరిగి చూశాడు.

"నువ్వా?" అన్నాడు నమ్మలేనట్టు. తన యింట్లో నమ్మకంగా చేరిన భృత్యుడు! ఇప్పుడు తనమీద నే చెయ్యి చేసుకున్నాడు.

జ్వలిత ఊపిరి తేలిగ్గా పీల్చుతున్నది. ఆమె పరిసరాలను పరిశీలనగా చూసింది. నాయుడిపక్కనే తన తండ్రి దగ్గర పనిచేసే సిబ్బంది, కోయవాళ్ళు నలుగురు. అందులో ఒకడు తనకు తెలిసిన సింగడు, లోడ్ అవుతున్న లారీ, లోడ్ చేస్తున్న నలుగురు మనుషులు, డ్రైవరు—అందరూ నాయుడి మీ చేతికింద నీళ్ళు తాగేవాళ్ళే!

నాయుడు వికటంగా నవ్వాడు. "జక్రయ్య నా మనిషి. ఎప్పటికప్పుడు నీ యింట్లో జరిగే విషయాలు, నీ గురించిన అన్ని వివరాలు నాకు తెలియచేసేవాడు. నీ యింట్లో నల్లత్రాచును వదేసినవాడు జక్రయ్య! ఇప్పుడు తెలిసిందా నా పవరెలాంటిదో! నీ వేలుతో నే నీ కళ్ళే పొడిపించగల్ను!.... నా మీదే గుండు పేలుద్దామనుకున్నావు కదూ. యిప్పుడు పేల్చు!...." దగ్గరగా వచ్చాడు.

అతని చేతిలో పట్టాకత్తి వున్నది. చందనాన్ని చెక్కలుగా నరకటానికి ఉపయోగించే కత్తి అది!

నాయుడి వెనకనే కోయవాళ్ళు నలుగురు పట్టాకత్తులతో నిల్చున్నారు.

రాఘవేంద్రరావు అటుయిటు చూశాడు. దగ్గర్లో యెలాంటి ఆయుధమూ లేదు! తనవాళ్ళనుకున్న వాళ్ళు' తనకింద నిన్నటిదాకా దండాలు పెడుతూ పనిచేసిన వాళ్ళు, చిరునవ్వులతో వినోదం చూస్తున్నారు!

జ్వలిత గుండె వేగం హెచ్చింది! ఇప్పుడు తను వాళ్ళ మధ్యకు వెళ్ళాలా, వద్దా? ఏం చెయ్యాలి?

ఆ మరుక్షణమే ఆమె గుండెలు బద్దలయ్యే సంఘటన జరిగిపోయింది. (సశేషం)